సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం । 18 । మే । 2023



పోలీస్ సేవల విస్తరణ

జిల్లాల పునర్విభజనతో ఏలూరు పోలీస్ రేంజ్ పరిధిలో కొత్త పోస్టులు, కొత్త కార్యాలయాలు ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. 8లో ▸



దగ్ధమైన వరి కుప్పల పరిశీలన

పోలవరం మండలం కొత్తపట్టిసీమలో జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమైన వరి కుప్పలను అధికారులు రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించారు. 8లో ▸

పారిజాతగిరిలో చందనోత్సవం

జంగారెడ్డిగూడెం పారిజాతగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీచక్రస్నానం, చందనోత్సవం, గజవాహన సేవలు ఘనంగా జరిగాయి. 8లో



న్యూస్‌రీల్

ఎండ నుంచి రక్షణకు చర్యలు



మాట్లాడుతున్న అసిస్టెంట్ లేబర్ అధికారి శివనాగమల్లేశ్వరరావు

సాక్షి, భీమవరం: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా ఫ్యాక్టరీలు, సంస్థలు, షాపుల్లో పనిచేసే కార్మికులకు ఇబ్బంది లేకుండా ఆయా సంస్థల యాజమాన్యాలు తగిన చర్యలు తీసుకునే విధంగా చూడాలని భీమవరం రెండో సర్కిల్ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కాశీ శివనాగ మల్లేశ్వరరావు అన్నారు. బుధవారం భీమవరం పాతబస్టాండ్ వద్ద సచివాలయంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ఈ-శ్రమ్, ఎండల తీవ్రతపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భీమవరం, ఆకివీడు, ఉండి, కాళ్లలోని దుకాణాలు, సంస్థల యాజమాన్యాలు కార్మికులకు చల్లటి తాగునీరు, మజ్జిగ, అత్యవసర మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పని ప్రదేశాల్లో ఎండ తగలకుండా చూడాలన్నారు. బాలకార్మికులను పనిలోనికి అనుమతిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రూ.15 వేలలోపు ఆదాయం కలిగిన అసంఘటిత రంగ కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకుని కార్డులు పొందాలని కోరారు.

నేత్రపర్వం.. తెప్పోత్సవం



మద్దిలో తెప్పోత్సవ దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో జరుగుతున్న హనుమద్ జయంతి సహిత కల్యాణ మహోత్సవాల్లో భాగంగా క్షేత్రంలోని పుష్కరిణిలో స్వామి వారి తెప్పోత్సవాన్ని బుధవారం రాత్రి నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి వేడుకను తిలకించారు. ఈఓ ఆకుల కొండలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రైతులను ఆదుకుంటాం



తెల్లం బాలరాజు, పోలవరం ఎమ్మెల్యే

బుట్టాయగూడెం: ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే సంఘటనలను కూడా రాజకీయంగా వాడుకోవాలని ప్రతిపక్షాలు చూడటం బాధాకరమని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా తీవ్ర ఎండలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారన్నారు. ఈ పరిస్థితుల్లో పోలవరం మండలం పట్టిసీమ సమీపంలో వరి కుప్పలు అగ్నికి ఆహుతయ్యాయన్నారు. విషయం తెలిసిన వెంటనే రెవెన్యూ, పోలీసు, ఫైర్, వ్యవసాయ శాఖ అధికారులందరినీ అప్రమత్తం చేసి ప్రమాద నివారణ చర్యలు తీసుకున్నామన్నారు. రెవెన్యూ, వ్యవసాయ అధికారులు తక్షణమే పంట నష్టం అంచనా వేసేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. అలాగే ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకువెళ్లామని చెప్పారు. అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యం, మొక్కజొన్న పంటలను కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తూ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని అన్నారు. అలాగే పట్టిసీమ సంఘటనలో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం న్యాయం చేస్తుందని చెప్పారు. ప్రతిపక్షాలు ప్రతి విషయాన్ని రాజకీయాలు చేయడం మానుకోవాలని సూచించారు.

'జగనన్నకు చెబుదాం'పై ప్రత్యేక దృష్టి

ఏలూరు(మెట్రో): జగనన్నకు చెబుదాం కార్యక్రమం అమలుపై పభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. ఏలూరు కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి, జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతితో కలిసి ఆయ న ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పోలీస్ అధికారులు, మండల స్థాయి అధికారులతో జగనన్నకు చెబుదాం కార్యక్రమం అమలుపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలో పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రతి సోమవారం గ్రీవెన్స్ అర్జీల పరిష్కారం నాణ్యత, స్పష్టతతో ఎండార్స్‌మెంట్ ఉండాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. జిల్లాలో గ్రీవెన్స్ అర్జీల్లో ఇటీవల రీఓపెనింగ్‌లు ఎక్కువగా వస్తున్నాయని, వీటిపై దృష్టి సారించాలన్నారు.

ధాన్యం కొనుగోళ్లు భేష్

10 రోజుల్లోపే సొమ్ముల జమ
- జిల్లాలో 2.23 లక్షల ఎకరాల్లో రబీ వరి సాగు
- 80 శాతానికి పైగా మాసూళ్లు పూర్తి
- 4.60 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు
- రైతులకు రూ.527 కోట్లు అందజేత



వీరవాసరం మండలంలో ధాన్యం పట్టుబడులు



ధాన్యాన్ని వాహనంలోకి ఎగుమతి చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: జిల్లాలో దాళ్వా ధాన్యం పట్టుబడులు, కొనుగోళ్లు వడివడిగా సాగుతుండగా రైతుల ఖాతాల్లోకి సొమ్ములు వేగంగా జమవుతున్నాయి. బంగాళాఖాతంలో ఆవర్తనం కారణంగా వారం పాటు కురిసిన వర్షాలకు ధాన్యం తడిసి రైతులు ఇబ్బందులు పడ్డారు. ఇదే అదనుగా కొందరు మిల్లర్లు ధాన్యం మర ఆడించగా నూక శాతం ఎక్కువ వస్తుందంటూ ధాన్యం దింపుకోవడానికి ఇబ్బందులు పెట్టారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం తడిసిన ధాన్యం సైతం కొనుగోలు చేస్తామని రైతులు అధైర్యపడవద్దని భరోసా ఇచ్చింది. దీనిపై జిల్లాస్థాయిలో అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి రైసు మిల్లర్లతో సంప్రదించి వేగంగా ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేశారు. ఇదే సమయంలో ప్రస్తుతం వాతావరణం కూడా అనుకూలించడంతో మాసూళ్లు ఊపందుకోగా ధాన్యం కొనుగోలు కూడా జోరుగా సాగుతోంది.

1.82 లక్షల ఎకరాల్లో మాసూళ్లు

జిల్లాలోని 20 మండలాల్లో ప్రస్తుత రబీ సీజన్‌లో దాదాపు 2.23 లక్షల ఎకరాల్లో వరినాట్లు వేయగా ఇప్పటివరకు సుమారు 1.82 లక్షల ఎకరాల్లో మాసూళ్లు పూర్తయ్యాయి. మొత్తంగా 80 శాతం వరకు మాసూళ్లు పూర్తికాగా తాడేపల్లిగూడెం ప్రాంతంలో 100 శాతం, గణపవరంలో 95, నరసాపురం, ఉండి ప్రాంతాల్లో 95 శాతం వరకు మాసూళ్లు పూర్తయినట్టు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఆచంట నియోజకవర్గంలోని ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర మండలాల్లోని రైతులు వెనుకబడ్డారని ఈ ప్రాంతంలో 70 శాతం మాత్రమే మాసూళ్లు పూర్తయ్యాయని అంటున్నారు.

56 వేల మంది నుంచి సేకరణ

జిల్లాలో ఇప్పటివరకు 56 వేల మంది రైతుల నుంచి దాదాపు రూ.938 కోట్ల విలువైన సుమారు 4.60 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. అలాగే 35 వేల మంది రైతులకు రూ.527 కోట్ల ధాన్యం సొమ్ములను వారి ఖాతాల్లో జమచేశారు. రైతులు తమ ధాన్యాన్ని మిల్లులకు తోలిన 10 రోజుల్లోపే సొమ్ములు జమచేస్తుండటంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రోజుకు 16 వేల టన్నుల వరకు..



జిల్లాలో రబీ ధాన్యం కొనుగోలు వేగంగా జరుగుతోంది. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండటంతో రైతులు మాసూళ్లలో నిమగ్నమయ్యారు. రోజుకు సుమారు 16 వేల టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. ఇప్పటివరకు సుమారు 4.60 లక్షల టన్నులు సేకరించగా రైతులకు పది రోజుల్లోనే ధాన్యం సొమ్ములు జమ చేస్తున్నాం.

– టి.శివరాంప్రసాద్, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్, భీమవరం

నాణ్యతతో నాడు-నేడు పనులు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సాక్షి, భీమవరం: జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో నాడు–నేడు కింద చేపట్టిన పనులు నాణ్యతతో పూర్తిచేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆమె అధికారులతో సమావేశమయ్యారు. మరుగుదొడ్ల నిర్మాణం, ఎలక్ట్రికల్ పనులు, మేజర్, మైనర్ మరమ్మతులు వచ్చే వారం నాటికి 60 శాతం పూర్తిచేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు చేసిన ఖర్చులకు బిల్లులను వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. నిర్ణయించిన ధరల్లో ఎలక్ట్రికల్ సామగ్రిని స్థానికంగా కొనుగోలు చేయాలన్నారు. పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వారంలో రెండు రోజులపాటు క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను పరిశీలించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ దేవరకొండ అఖిల, సమగ్ర శిక్ష అడిషనల్ కో–ఆర్డినేటర్ పి.శ్యామ్ సుందర్, జిల్లా పంచాయతీ రాజ్ శాఖ అధికారి పి.శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ బి.లోకేశ్వరరావు, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఏఎస్ఏ రామస్వామి, పబ్లిక్ హెల్త్ ఈఈ, డీఈలు పాల్గొన్నారు.



సోమేశ్వరుడి శోభ

వైశాఖమాస త్రయోదశి సందర్భంగా బుధవారం పంచారామక్షేత్రం భీమవరం గునుపూడి లోని ఉమాసోమేశ్వర జనార్దనస్వామి ఆలయంలో లక్ష పత్రి పూజ, లక్ష కుంకుమార్చన, జ్యోతిర్లింగార్చనలు ఘనంగా జరిగాయి. మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఈవో చాగంటి సురేష్‌నాయుడు, అర్చకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

– భీమవరం (ప్రకాశంచౌక్)

మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట

ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



మత్స్యకారులకు చెక్కు అందిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, కలెక్టర్ ప్రశాంతి

నరసాపురం: మత్స్యకారుల సంక్షేమానికి గతంలో ఎన్నడూ లేనివిధంగా పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు అమలు చేస్తున్నారని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. జిల్లాకు సంబంధించి 5వ విడత మత్స్యకార భరోసా ప్రారంభ కార్యక్రమాన్ని బుధవారం స్థానిక అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా చీఫ్ విప్ మాట్లాడుతూ టీడీపీ హయాంలో వేట నిషేధ సాయం కింద రూ.104 కోట్లు అందిస్తే తాము నాలుగేళ్లలో రూ.650 కోట్లు అందించామన్నారు. వేట సాగించే మత్స్యకారుల పిల్లల ఉన్నత చదువులకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. దేశంలో మూడోదిగా నరసాపురంలో నెలకొల్పుతున్న ఆక్వా యూనివర్సిటీతో మత్స్యకారులు అభివృద్ధి చెందుతారని, రానున్న అక్టోబర్‌లో కోర్సులు ప్రారంభమవుతాయని చెప్పారు. సీఎం జగన్ కులవృత్తుల వారిని వృత్తిపరంగా ఆదుకోవడంతో పాటు సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఎందుకు ఇలాంటి మంచి ఆలోచనలు చేయలేదో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. రాష్ట్రానికి మంచి చేస్తున్న సీఎం జగన్‌ను ఎదుర్కోవడానికి అంతా ఏకమవుతున్నారని మండిపడ్డారు. జగన్‌ను మరోమారు ముఖ్యమంత్రిని చేసి అభివృద్ధి, సంక్షేమ పరంపరను కొనసాగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

1,635 మందికి మత్స్యకార భరోసా

కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ మత్స్యకారుల పిల్లలు ఐఏఎస్ టాపర్‌గా నిలిచిన రేవు ముత్యాలరాజును ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 1,635 మందికి రూ.1.64 కోట్లు మత్స్యకార భరోసా కింద ప్రభుత్వం వారి ఖాతాల్లో జమచేసిందన్నారు. నరసాపురంలో ఆక్వా యూనివర్సిటీ ఏర్పాటు, ఫిషింగ్‌హార్బర్ నిర్మాణాలకు స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు కృషే కారణమన్నారు. అనంతరం ప్రధాని మత్స్యకార సమృద్ధి యోజన పథకం కింద ఆరుగురికి సబ్సిడీతో కూడిన ద్విచక్ర వాహనాలు అందించారు.

మత్స్యకార సొసైటీల సంఘం జిల్లా అధ్యక్షుడు అంద్రాజు చల్లారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెంట్ర వీరన్న, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ బందన పూర్ణ, మొగల్తూరు జెడ్పీటీసీ తిరుమాని బాబ్జి, నరసాపురం సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ మత్స్యకార నేతలు బర్రి శంకరం, తిరుమాని నాగరాజు, తిరుమాని కృష్ణంరాజు, కర్రి ఏసుబాబు, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల, యూత్ అధ్యక్షులు భూసరపు జయ, దొంగ మురళీకృష్ణ, మెర్లిన్, మాజీ జెడ్పీటీసీ చాగంటి సత్యనారాయణ, మత్స్యశాఖ జేడీ ఆర్జీవీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలు



బాస్కెట్‌బాల్ పోటీల ప్రారంభ సందర్భంగా ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని, ప్రభుత్వ ఉద్యోగాలు కూడా పొందవచ్చని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. ఉల్లంపర్రులోని మాంటిస్సోరి స్కూల్ ప్రాంగణంలో బుధవారం కవురు శ్రీనివాస్ 6వ రాష్ట్రస్థాయి బాలురు, బాలికల బాస్కెట్‌బాల్ పోటీలను ప్రారంభించి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సుమారు 26 జట్లు పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నాయన్నారు. కవురు శ్రీనివాస్ కప్ పేరుతో ఈ పోటీలను నిర్వహించడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. పోటీల ప్రారంభం సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జాతీయస్థాయి బాలురు, బాలికల జట్లకు ఎంపిక చేస్తారని చెప్పారు. మాంటిస్సోరి విద్యాసంస్థల డైరెక్టర్ మద్దాల వాసు, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి చక్రవర్తి, కోశాధికారి రేవతి, డిస్ట్రిక్ట్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సెక్రటరీ జి శ్రీనివాస్, కన్వీనర్లు రామకృష్ణ, సతీష్, ప్రిన్సిపాల్ ఎస్ వసంతలక్ష్మి, రావాడ సతీష్, వైసీపీ మండల కన్వీనర్ ఎం.మైఖేల్‌రాజు, సచివాలయ కన్వీనర్ పార్శి వెంకటరత్నం పాల్గొన్నారు.

గోదావరిలో యువకుడి గల్లంతు



జయప్రసాద్ (ఫైల్)

యలమంచిలి: మండలంలోని ఆర్యపేటకు చెందిన మైలాబత్తుల జయప్రసాద్ (19) బుధవారం గోదావరిలో మునిగి గల్లంతయ్యాడు. యలమంచిలి పుష్కరాల రేవులో అతని స్నేహితులతో కలిసి కబుర్లు చెప్పుకుంటూ అనంతరం కాళ్లు కడుక్కునే నిమిత్తం గోదావరిలో దిగాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ కాలు జారి పడిపోయాడు. అక్కడ లోతుగా ఉండటంతో మునిగి గల్లంతయ్యాడు. గజ ఈతగాళ్లతో గాలించినా అతడి ఆచూకీ తెలియరాలేదు. జయప్రసాద్ అక్క తూర్పుగోదావరి జిల్లా గొంది గ్రామానికి చెందిన కానేటి సత్యప్రియ యలమంచిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై జాజుల విజయ నాగ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు



అధికారులతో మాట్లాడుతున్న డీఆర్వో కృష్ణవేణి

సాక్షి, భీమవరం: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని డీఆర్వో కె.కృష్ణవేణి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో ఆమె సమీక్షించారు. జిల్లాలో ఈనెల 24 నుంచి వచ్చేనెల 1 వరకు 35 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని డీఆర్వో చెప్పారు. ఫస్టియర్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండియర్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. ఆయా కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, టాయిలెట్లు, ఫర్నిచర్, మౌలిక వసతుల ఏర్పాట్లను పరిశీలించాలన్నారు. ఏ విద్యార్థి కూడా నేల మీద కూర్చుని పరీక్షలు రాయకూడదని ఆమె ఆదేశించారు. కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స కేంద్రాలు, ఆశవర్కర్లు, ఏఎన్ఎంలను నియమించాలన్నారు. పరీక్షల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. విద్యార్థులు సమయంలోపు కేంద్రాలకు చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ అధికారులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో జెరాక్స్ షాపులు, కంప్యూటర్ సెంటర్లు మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని డీఆర్వో కృష్ణవేణి ఆదేశించారు. ఆర్ఐఓ చంద్రశేఖర్ బాబు, డీఎల్‌పీఓ ఎం.నాగలత, పోలీస్ అధికారులు, ఈపీడీసీఎల్ ఏఈ తదితరులు పాల్గొన్నారు.

మేధస్సును వెలికి తీసేలా 'సాక్షి' చెస్ శిక్షణ

- ఆర్డీఓ దాసి రాజు
- ముగిసిన శిక్షణ కార్యక్రమం



'సాక్షి' చెస్ శిక్షణ తరగతుల్లో పాల్గొన్న క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందించిన ఆర్డీఓ దాసి రాజు

సాక్షి, భీమవరం: బాలల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు పిల్లల్లో మేధస్సును పెంచేలా 'సాక్షి' మీడియా చదరంగ శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమని భీమవరం ఆర్డీఓ దాసి రాజు అన్నారు. భీమవరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఆదిత్య కళావేదికపై 'సాక్షి' ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన చెస్ శిక్షణ ముగింపు కార్యక్రమానికి బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిక్షణ పొందిన క్రీడాకారులకు నిర్వాహకులు పోటీలు నిర్వహించి బహుమతులు, శిక్షణలో పాల్గొన్న అందరికీ ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు క్రీడలపై ఆకర్షితులయ్యేలా చెస్ శిక్షణా తరగతులు దోహదపడతాయన్నారు. 'సాక్షి' మీడియా ప్రజాసమస్యలను వెలికి తీయడమేగాక ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలను అర్హులకు అందేందుకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. చదరంగం పిల్లల్లో మేధోశక్తిని పెంచేందుకు దోహదపడుతుందని, చెస్‌పై పిల్లలకు ఆసక్తి కలిగించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. హౌసింగ్ బోర్డు కాలనీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కుక్కల బాల మాట్లాడుతూ 'సాక్షి' ఆధ్వర్యంలో విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచేందుకు చెస్ శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తమ అసోసియేషన్‌ను భాగస్వామ్యం చేయడం ఆనందదాయకమన్నారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న సుమారు 30 మంది చిన్నారులకు హౌసింగ్ బోర్డు కాలనీ అసోసియేషన్, అనసూయ చెస్ అకాడమీ సహకారంతో ప్రశంసా పత్రాలు, మెడల్స్‌ను ఆర్డీఓ దాసి రాజు చేతులమీదుగా అందజేశారు. చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, చెస్ కోచ్ మాదాసు కిషోర్, శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ అల్లు శ్రీనివాస్, చెస్ అసోసియేషన్ జిల్లా సంయుక్త కార్యదర్శి మైలాపురి మురళి తదితరులు పాల్గొన్నారు.

ఈఏపీ సెట్‌కు 2,917 మంది హాజరు



తాడేపల్లిగూడెం కేంద్రంలో విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఏపీ ఈఏపీ సెట్ పరీక్షలు బుధవారం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ప్రశాంతంగా జరిగాయి. 10 కేంద్రాల్లో 2,917 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఏలూరులోని సిద్ధార్థ క్వెస్ట్ సెంటర్‌లో ఉదయం 180 మందికి 171 మంది, మధ్యాహ్నం 180 మందికి 179 మంది హాజరయ్యారు. ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 130 మందికి 128 మంది, మధ్యాహ్నం 130 మందికి 126 మంది హాజరయ్యారు. సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 150 మందికి 145 మంది, మధ్యాహ్నం 150 మందికి 144 మంది హాజరయ్యారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లాలోని 7 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 1,041 మందికి 1,008 మంది హాజరు కాగా 33 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 1,042 మందికి 1,016 మంది హాజరు కాగా 26 మంది గైర్హాజరయ్యారు.

ప్రత్యేకాధికారుల కొనసాగింపు

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలోని భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, తణుకు మున్సిపాలిటీలకు సంబంధించి ప్రత్యేక అధికారులను మరో ఆరు నెలల పాటు కొనసాగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుని మున్సిపల్ శాఖ నుంచి ఉత్తర్వులు జారీ చేసింది. భీమవరం మున్సిపాలిటీకి ప్రత్యేక అధికారిగా కలెక్టర్ పి.ప్రశాంతి, తాడేపల్లిగూడెం, పాలకొల్లు మున్సిపాలిటీలకు భీమవరం ఆర్డీఓ దాసి రాజు, తణుకు మున్సిపాలిటీకి నరసాపురం సబ్ కలెక్టర్ సూర్యతేజ ప్రత్యేక అధికారులుగా ఉన్నారు. వచ్చే నవంబర్ వరకూ వారినే ప్రత్యేకాధికారులుగా కొనసాగించనున్నారు.

క్లుప్తంగా

ఉదయం 6 గంటలకే శ్రీవారి దర్శనానికి బారులు



శ్రీవారి కేశఖండనశాల వద్ద క్యూ కట్టిన భక్తులు

ద్వారకాతిరుమల: భానుడి భగభగలకు శ్రీవారి భక్తులు అల్లాడుతున్నారు. ఎండ రాకముందే మొక్కులు చెల్లించి, స్వామివారిని దర్శిస్తున్నారు. ఈ క్రమంలోనే బుధవారం ఉదయం 6 గంటల సమయంలో పెద్ద ఎత్తున భక్తులు చినవెంకన్నకు మొక్కులు చెల్లించేందుకు కేశ ఖండనశాల వద్ద క్యూ కట్టారు. క్షురకులు వారికి త్వరితగతిన సేవలను అందించారు. అనంతరం ఆలయానికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఎండతీవ్రత అధికంగా ఉండటంతో కొండపైన, అలాగే ఘాట్ రోడ్ల వెంబడి ఉన్న చెట్ల కింద భక్తులు సేదతీరారు.

మైనార్టీ పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చింతలపూడి: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 12 మైనార్టీ పాఠశాలల్లో 5, 6, 7, 8 తరగతులు, 3 మైనార్టీ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఏవిధమైన ప్రవేశ పరీక్ష లేకుండా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు నాగిరెడ్డిగూడెం గురుకుల పాఠశాల (బాలికలు) ప్రిన్సిపాల్ ఎం.సురేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 నుంచి 30వ తేదీ వరకు జ్ఞ ఇట://ఛ ఇటట.ఛ ఖిజ టట.జీ ఃవెబ్‌సైట్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకుని, పూర్తి చేసిన దరఖాస్తులను, విద్యార్థి, తల్లి, తండ్రి ఆధార్, తల్లి బ్యాంకు అకౌంట్ మొదటి పేజీ జిరాక్స్ జతచేసి ఆయా పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో సమర్పించాలన్నారు. ముందుగా వెళ్లిన వారికి వారి అర్హత మేరకు నిబంధనలు అనుసరించి ప్రవేశాలు కల్పించడం జరుగుతుందన్నారు.

కొత్త జిల్లాల్లో పోలీసు సేవల విస్తరణ

- అమలాపురం, భీమవరంలో దిశా డీఎస్పీ కార్యాలయాలు
- తాడేపల్లిగూడెంలో నూతన డీఎస్పీ కార్యాలయం
- భీమవరంలో సీసీఎస్ స్టేషన్‌కు ఏర్పాటుకు ప్రతిపాదన
- ఆచంటలో నిర్మాణం తుది దశలో మోడల్ పోలీస్‌స్టేషన్

సాక్షిప్రతినిధి, ఏలూరు: జిల్లాల పునర్విభజనతో ఏలూరు పోలీస్ రేంజ్ పరిధిలో కొత్త పోస్టులు, కొత్త కార్యాలయాలు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే కొత్త జిల్లాలకు అనుగుణంగా పోస్టులు మంజూరై అధికారులు విధుల్లో ఉన్న క్రమంలో కొత్త కార్యాలయాలు, కొత్త స్టేషన్ల ప్రతిపాదనలకు ప్రభుత్వం కొన్నింటికి ఆమోదముద్ర వేయటం, మరికొన్నింటిని తుది దశలో ఉండటంతో ఆ మేరకు ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. కొత్తగా రేంజ్ పరిధిలో బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో, నూతన పశ్చిమగోదావరి జిల్లాలో దిశా డీఎస్పీ కార్యాలయాలు ఏర్పాటు కానున్నాయి.

వసతులు, సౌకర్యాలపై దృష్టి

పరిపాలనా సౌలభ్యం కోసం జిల్లాల పునర్విభజన గతేడాది జరిగింది. దీంతో ఏలూరు పోలీస్ రేంజ్ పరిధి ఆరు జిల్లాలకు విస్తరించింది. ఈ క్రమంలో ఆరు జిల్లాల్లో పూర్తిస్థాయి పోలీస్ కార్యకలాపాలతో పాటు వసతులు, సౌకర్యాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. దీనిలో భాగంగా కోనసీమ జిల్లాలోని అమలాపురం కేంద్రంగా, పశ్చిమగోదావరి జిల్లాలో భీమవరం కేంద్రంగా దిశా డీఎస్పీ కార్యాలయాలు ఏర్పాటు చేయడానికి స్థల ప్రతిపాదనలు ఖరారు చేశారు. ఇప్పటికే రెండు స్థానాల్లో గత బదిలీల్లో డీఎస్పీలను కేటాయించారు. వారికి కార్యాలయం, స్టేషన్ ఏర్పాట్లపై దృష్టి సారించారు.

త్వరలో భవన నిర్మాణ పనులు

తాడేపల్లిగూడెం కొత్తగా పోలీస్ సబ్ డివిజన్ ఏర్పాటై పది రోజుల క్రితమే డీఎస్పీని నియమించారు. అక్కడ కూడా నూతన డీఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. దీని కోసం ఇప్పటికే స్థల సేకరణ పూర్తి చేశారు. ప్రభుత్వ అనుమతితో భవన నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు. అలాగే నరసాపురంలో డీఎస్పీ భవనాన్ని సీఎస్ఆర్ ఫండ్‌తో పూర్తి స్థాయిలో ఆధునీకీకరించారు. వచ్చే నెలలో దీనిని ప్రారంభించనున్నారు. ఆచంటలో మోడల్ పోలీస్ స్టేషన్ పనులు తుది దశకు చేరుకున్నారు. ఇక్కడ కూడా నెల రోజుల వ్యవధిలో స్టేషన్ ప్రారంభించనున్నారు.

ఉంగుటూరు కేంద్రంగా సీసీఎస్ స్టేషన్

కొత్త జిల్లాలు ఏర్పడిన క్రమంలో దిశా, సీసీఎస్ పోలీస్‌స్టేషన్, ఇతర డీఎస్పీ కార్యాలయాల ఏర్పాటుపై పోలీస్ శాఖ ప్రధానంగా దృష్టి సారించింది. పోస్టుల భర్తీ, ప్రక్రియ పూర్తి చేసి తాత్కాలిక స్టేషన్లతో కార్యకలాపాలు కొనసాగిస్తూ శాశ్వత భవనాలపై దృష్టి సారించారు. దీంతో పాటు ప్రధానంగా నూతన పశ్చిమగోదావరి జిల్లాకు సీసీఎస్ పోలీస్‌స్టేషన్ ఇంతవరకు లేదు. ఈ క్రమంలో భీమవరంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా, గ్రీన్‌సిగ్నల్ లభించింది. నూతన పశ్చిమగోదావరి జిల్లాలో ఆస్తి వివాదాలు, దొంగతనాలకు సంబంధించిన కేసులు, చీటింగ్ కేసులు ఎక్కువ నమోదవుతున్నాయి. వీటిని పరిగణనలోకి తీసుకుని సీసీఎస్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసి కేటాయించనున్నారు. అలాగే ఉంగుటూరు కేంద్రంగా సీఐ పనిచేసేలా డీజీపీ కార్యాలయానికి ప్రతిపాదనలు పంపారు.



జీవీవీ అశోక్‌కుమార్, ఏలూరు రేంజ్ డీఐజీ

కొద్దినెలల్లో ప్రారంభం

ఆచంట పోలీస్‌స్టేషన్, నరసాపురం డీఎస్పీ కార్యాలయాన్ని వచ్చే నెలలో ప్రారంభిస్తామని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీవీ అశోక్ కుమార్ తెలిపారు. కొత్త జిల్లాల నేపథ్యంలో డీఎస్పీ పోస్టులు అదనంగా మంజూరయ్యాయని, అలాగే దిశా మరింత పటిష్టం చేయడానికి డీఎస్పీ కార్యాలయాన్ని మరికొన్ని ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని వివరించారు.

కలెక్టర్ ఆదేశాలతో వృద్ధుడి సంరక్షణకు చర్యలు

కొయ్యలగూడెం: కొన్ని రోజులుగా ఆకలితో అలమటిస్తూ ఓ గుర్తు తెలియని వృద్ధుడు చెట్టు కింద గడుపుతున్నాడని స్థానికుల ద్వారా తెలుసుకున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మానవత్వంతో స్పందించి వృద్ధుడి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కనకాద్రిపురం (ఆరిపాటి) సమీపంలోని అర్లమ్మ గుడి వద్ద కొన్ని రోజులుగా ఓ గుర్తు తెలియని వృద్ధుడు రోడ్డు పక్కన చెట్టు కింద గడుపుతున్నాడు. ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆకలితో అలమటిస్తున్న అతనిని గుర్తించిన ఓ వ్యాపారి ముంజులు తినిపించాడు. ఆహారం లేక నీరసించిన వృద్ధుడి పరిస్థితిని కొందరు గ్రామ కార్యదర్శికి తెలియజేసినా స్పందించకపోవడంతో నేరుగా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే కలెక్టర్ స్పందించి వృద్ధుడికి పునరావాసం కల్పించాలని తహసీల్దార్ పి.నాగమణికి ఆదేశాలు జారీ చేశారు. తహసీల్దార్ తమ సిబ్బందిని వృద్ధుడు ఉన్న ప్రాంతానికి వాహనం ఇచ్చి పంపించారు. ఆర్ఐ దివ్య బృందం వృద్ధుడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. వృద్ధుడికి స్నానం చేయించి కొత్త దుస్తులు తొడిగించి చికిత్స చేయించారు. వృద్ధుడి ఆరోగ్య పరిస్థితిని తహసీల్దార్ నాగమణి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలవరం వృద్ధాశ్రమంలో చేర్పిస్తామని తహసీల్దార్ తెలిపారు. కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ సేవలను పలువురు అభినందించారు.



ఆరిపాటి సమీపంలో అచేతనంగా పడి ఉన్న గుర్తు తెలియని వృద్ధుడు



కొయ్యలగూడెం పీహెచ్‌సీలో వృద్ధుడిని యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్

కొత్తపట్టిసీమ అగ్నిప్రమాదంలో రూ.15 లక్షల నష్టం

- 26 ఎకరాల్లోని 16 వరికుప్పలు దగ్ధం
- 15 మంది బాధిత రైతుల గుర్తింపు
- క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారుల పరిశీలన

పోలవరం రూరల్: కొత్తపట్టిసీమ గ్రామంలో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమైన వరి కుప్పలను అధికారులు రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించారు. 3 కిలోమీటర్ల పరిధిలో వ్యాపించిన మంటల వల్ల ఎంత వరకు పంటలకు నష్టం వాటిల్లింది అనే దానిపై అంచనాలను రూపొందించారు. వ్యవసాయ శాఖ ఏడీ పీజీ బుచ్చిబాబు, మండల వ్యవసాయ శాఖాధికారి కె.రాంబాబు, వీఆర్వో, గ్రామస్తులతో కలిసి బుధవారం దగ్ధమైన వరికుప్పల వివరాలను నమోదు చేసుకున్నారు. మంటలు పూర్తిగా తగ్గడంతో బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించగా, 15 మంది రైతులకు సంబంధించి 26 ఎకరాల భూముల్లోని 16 వరి కుప్పలు పూర్తిగా కాలిపోయాయన్నారు. సుమారు 78 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని, వీటి విలువ సుమారు రూ.15 లక్షల వరకు ఉంటుందని వ్యవసాయశాఖాధికారి రాంబాబు తెలిపారు. నష్టం వివరాలపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించినట్లు తెలిపారు.



దగ్ధమైన వరికుప్పలను పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

● గడపగడపకు సంక్షేమం



పాలకోడేరు: వేంద్ర గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు



పాలకొల్లు అర్బన్: భగ్గేశ్వరం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు నవరత్నాల పథకాలను వివరిస్తున్న శాసనమండలి సభ్యులు కవురు శ్రీనివాస్

మద్దిలో నేత్రపర్వంగా చక్రస్నానం

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రంలో జరుగుతున్న హనుమజ్జయంతి సహిత కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. యాగశాలలో ఆలయ వేద పండితులు మహాపూర్ణాహుతి హోమాన్ని వేదమంత్రాలతో నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులకు పుష్కరిణిలో చక్రస్నానం, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ ఆకుల కొండలరావు, ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.



పుష్కరిణిలో స్వామివారికి చక్రస్నానం కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు

పోక్సో కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెంలోని సీతానగరంలో ఓ బాలిక తన తల్లిదండ్రులతో కలిసి ఉంటోంది. వీరితో పాటు బాలిక అక్క, బావ కూడా కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో బాలిక అక్క భర్త ఈ నెల 7న బాలికను అసభ్యకరంగా తాకుతూ అత్యాచారయత్నానికి పాల్పడగా తప్పించుకుంది. మరలా ఈ నెల 15న బాలికతో మరోసారి అదేవిధంగా ప్రవర్తించడంతో, విషయం తెలుసుకున్న బాలిక కుటుంబ సభ్యులు అతనిని నిలదీశారు. దీంతో బాలిక అక్కను కొట్టి, అందరినీ చంపుతానని బెదిరించాడు. బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దత్తత చిన్నారులకు మంచి భవిష్యత్ కల్పించాలి

ఏలూరు (మెట్రో): దత్తత బాలిక కొండలమ్మను దత్తత తల్లిదండ్రులు బాగా చదివించి మంచి భవిష్యత్తు కల్పించాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ కోరారు. బుధవారం జిల్లా కలెక్టర్ చాంబర్‌లో దత్తత స్వీకరణ కార్యక్రమంలో భాగంగా చట్టప్రకారం అన్ని అర్హతలతో దరఖాస్తు చేసుకున్న కేరళ రాష్ట్రానికి చెందిన రవీంద్ర పిళ్లై, ఉషా రవీంద్ర దంపతులకు జిల్లా బాలల సంరక్షణ గృహంలో ఉన్న కొండాలమ్మ అనే తొమ్మిదేళ్ల బాలికను కలెక్టర్ దత్తత ఇచ్చారు. వీరు ఆడపిల్ల దత్తత కోసం 2015లో అర్జీ చేసుకున్నట్లు జిల్లా దత్తత అధికారైన జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ దత్తత తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు. రవీంద్ర పిళ్లై ఆర్మీలో పనిచేసి రిటైరై ప్రస్తుతం ప్రైవేటు కంపెనీలో సెక్యూరిటీ సర్వీసెస్ అందిస్తున్నారు. ఇతని భార్య ఉషా రవీంద్ర గృహిణిగా ఉన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ లలిత, డీసీపీఓ సీహెచ్ సూర్యచక్రవేణి రక్షణ అధికారి రాజేష్, ఈవో మల్లిక పాల్గొన్నారు.



బాలికను దత్తత ఇస్తున్న కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

అనుమానాస్పద స్థితిలో కూలీ మృతి

ఏలూరు టౌన్: ఏలూరు రూరల్ బీడీ కాలనీ గట్టు ప్రాంతానికి చెందిన ఒక కూలీ అప్పుల బాధ భరించలేక ఇంట్లోనే బలన్మరణానికి పాల్పడ్డాడు. ఏలూరు రూరల్ బీడీ కాలనీ గట్టు ప్రాంతానికి చెందిన పల్లెల అర్జున్ కిషోర్ (23) తన తల్లిదండ్రులతో ఉంటూ టైల్స్ వేసే పనులకు వెళుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదురుకావటంతో తీవ్ర మానసిక వేదనకు గురయ్యాడు. మంగళవారం రాత్రి ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ ఎస్ఐ ఎన్.లక్ష్మణబాబు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పోస్టుమార్టంకు తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఏలూరు శివారు ఆశ్రం ఆస్పత్రి సమీపంలోని బస్‌షెల్టర్‌లో ఒక గుర్తు తెలియని వ్యక్తి బుధవారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ ఎస్ఐ ఎన్.లక్ష్మణబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి సుమారు 50 ఏళ్ల వయస్సు ఉండవచ్చని, వడదెబ్బ వల్ల మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని ఏలూరు సర్వజన ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మట్టి ట్రాక్టర్ బోల్తా పడి కూలీ దుర్మరణం

చింతలపూడి: యర్రంపల్లిలో మట్టి ట్రాక్టర్ బోల్తా పడి ఓ కూలీ అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అగ్నిపర్తి విజయకుమార్ (21) ట్రాక్టర్‌పై మట్టి పనులకు వెళుతుంటాడు. బుధవారం కూడా పనులకు వెళ్లగా, ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ బోల్తా పడటంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై హరికృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిజాతగిరిలో వేడుకగా చందనోత్సవం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పారిజాతగిరి వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా బుధవారం ఆలయంలో నిత్య హోమం, వసంతోత్సవం, చక్రస్నానం, మహాపూర్ణావతి, గజవాహనం సేవ అత్యంత వేడుకగా నిర్వహించారు. ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం కార్యక్రమంతో ప్రారంభించి అనంతరం స్వామివారి కల్యాణ మండపంలో ఆలయ ప్రధానార్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసునికి, సుదర్శన్ పెరుమాళ్‌కు వసంతోత్సవం, చూర్ణోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ఈశాన్య భాగంలో గల కోనేరులో సుదర్శన్ పెరుమాళ్‌కు చక్రస్నాన ఉత్సవం నిర్వహించారు. ఆలయ యాగశాలలో పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించి సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసునికి గజవాహనంపై తిరువీధి ఉత్సవం వైభవంగా జరిపారు. అనంతరం ధ్వజ అవరోహణ గావించారు. ఈ కార్యక్రమాలకు ఉభయధారులుగా అబ్బిన దత్తాత్రేయ, సత్యవతి దంపతులు, బూరుగుమిల్లి రవీందర్, శ్యామల దంపతులు, కోతపోతుల బాబి, శ్రీనివాస్, లక్ష్మీ దంపతులు వ్యవహరించారు. ఆలయ ప్రధానార్చకులు నల్లూరి రవికుమారాచార్యులు ఉభయధారులను స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదాలు, వేద పండితులు ఆశీస్సులతో సన్మానించారు. రూపాదేవి శిష్యబృందం కూచిపూడి, భరత నాట్య ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో సత్యసాయి పవన్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాగా, గురువారం స్వామివారి ధ్రువమూర్తికి అభిషేకం, రాత్రికి శ్రీ పుష్ప యాగం, పవళింపు సేవ నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణ అధికారి మాణికల రాంబాబు తెలియజేశారు.



స్వామివారిని గజవాహనంపై ఊరేగిస్తున్న దృశ్యం



స్వామి, అమ్మవార్లకు చందనోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

● భానుడి ప్ర'తాపం'



మండే ఎండలోనూ బతుకు పోరాటం



నరసాపురంలో కర్ఫ్యూను తలపిస్తున్న రోడ్డు



ఏలూరులో ఎండ మండుతున్నా మామిడి విక్రయాలు చేస్తున్న చిరు వ్యాపారులు

భానుడి ప్రతాపంతో ప్రజలు బేజారెత్తుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా వేసవి ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదువుతూ ఠారెత్తిస్తున్నాయి. బుధవారం ఉదయం నుంచి ఎండ ఎక్కువగా ఉండటంతో ప్రజలు బయటకు రాకపోవడంతో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. పట్టణ ప్రాంతాల్లో చిరు వ్యాపారులు గొడుగులు, దుప్పట్లతో ఎండ నుంచి కాపాడుకుంటూ వ్యాపారాలు సాగిస్తున్నారు.

ఫొటోగ్రాఫర్/ఏలూరు, నరసాపురం

చోరీ కేసులో వ్యక్తికి జైలు శిక్ష

భీమవరం (ప్రకాశం చౌక్): పట్టణంలో పలు దొంగతనాల కేసుల్లో ఓ వ్యక్తి నేరం రుజువు కావడంతో అతనికి న్యాయమూర్తి తొమ్మిది నెలల జైలు శిక్ష విధించినట్లు టుటౌన్ సీఐ వి. కృష్ణకుమార్ బుధవారం చెప్పారు. కేసు వివరాలను ఆయన వెల్లడించారు. గతేడాది అగస్టులో భీమవరం చెట్టు కింద సాయిబాబు గుడి ఏరియాలో నివాసం ఉంటున్న పుప్పాల చంద్రశేషమూర్తి ఇంట్లో దొంగతనం జరగగా రూ.8 లక్షల నగదు, 495 గ్రాముల బంగారం పోయినట్లు అప్పట్లో కేసు నమోదైంది. అలాగే ఏఎస్సార్ నగర్‌లోని విజ్జురోతి గణేష్ ఇంట్లో డాక్యుమెంట్లు, నగదు దొంగలించారనే కేసు నమోదు చేశారు. అలాగే శ్రీరామపురానికి చెందిన మాది శ్రీనివాస్‌కు చెందిన హెచ్ఎఫ్ డీలక్స్ వాహనం చోరీకి గురైంది. ఈ కేసులపై జిల్లా ఎస్పీ రవి ప్రకాష్ ఆదేశాల మేరకు భీమవరం డీఎస్పీ బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో టూటౌన్ సీఐ కృష్ణకుమార్, ఎస్సై అప్పారావు దర్యాప్తు చేపట్టగా కాకినాడ జిల్లా జగన్నాథపురం మండలం ఏటిమొగ పొన్నాడ రవి శంకర్ అలియాస్ వీరబాబును అదుపులోకి తీసుకుని విచారణ చేయగా, నిందితుడిగా కేసులు నమోదు చేసి అతని నుంచి చోరీ సొత్తు రికవరీ చేశారు. ఈ కేసులలో నిందితుడు వీరబాబును కోర్టులో హాజరుపరచగా బుధవారం న్యాయమూర్తి డి.ధనరాజు అతనికి 9 నెలలు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు కృష్ణకుమార్ తెలిపారు.

క్లుప్తంగా

విజయవాడ తరలివెళ్లిన కొమ్ముగూడెం గ్రామస్తులు



కొమ్ముగూడెం నుంచి ప్రత్యేక బస్సులో విజయవాడ వెళ్తున్న భక్తులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొమ్ముగూడెం గ్రామం నుంచి విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహిస్తున్న శ్రీమహాలక్ష్మీ యజ్ఞం చూసేందుకు బుధవారం భక్తులు తరలివెళ్లారు. డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో బయల్దేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ రాష్ట్ర కోశాధికారి కొల్లా విజయలక్ష్మి కుమారి, కొమ్ముగూడెం సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్, వైస్ ఎంపీపీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి కల్యాణం



అన్నసమారాధనలో పాల్గొన్న గ్రంధి రవితేజ

వీరవాసరం: తోలేరు శివారు వెంకటాపురంలో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల్లో బుధవారం అక్కడ పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. ముందుగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాల దుర్గా నాగమల్లేశ్వరరావు, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తనయుడు రవితేజ, భోగిరెడ్డి శ్రీనివాసరావు, గూడూరు ఓంకార్, యింటి రాఘవేంద్ర, డీవీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

గుంతల పూడిక పనులు



కోమటిగుంట వెళ్లే ఆర్ అండ్ బీ రహదారి గుంతలు సరి చేస్తున్న దృశ్యం

కాళ్ల: గోతులమయమైన ఆర్ అండ్ బీ రహదారి గుంతలు పూడిక పనులు చేపట్టారు. కోమటిగుంట గ్రామం వెళ్లే ఆర్అండ్బీ రహదారి గోతులమయంగా మారింది. దీంతో ప్రయాణికులు, వాహదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల ఇబ్బందులు తీర్చేందుకు సర్పంచ్ బోణం భాగ్యశ్రీ శివకుమార్ జేసీబీ ఏర్పాటు చేయించారు. దీంతో గుంతలు సరి చేసి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా పనులు చేస్తున్నట్లు తెలిపారు. పనులను వైఎస్సార్‌సీపీ నేత బోణం శివకుమార్ పర్యవేక్షించారు.

దాతల సహకారం అభినందనీయం

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రతిభావంతులను ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు అభినందించడం మంచి పరిణామమని మున్సిపల్ కమిషనర్ ఎం.శివరామ కృష్ణ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో మున్సిపల్ హైస్కూల్లో పదో తరగతిలో ప్రతిభ చాటిన 9 మంది విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో దాతృత్వం ఎక్కువ అని, పేద విద్యార్థులకు చేయూతనివ్వడంలో దాతలు ముందుంటారని ఈ ఏడాది మున్సిపల్ హైస్కూల్లోని పదో తరగతి విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. దాతల దాతృత్వానికి విద్యార్థుల మంచి ఫలితాలే నిదర్శనమని కమిషనర్ అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 6 మున్సిపల్ హైస్కూ ల్లో 9 మంది విద్యార్థులు విశేష ప్రతిభ చాటారని అన్నారు. వారికి అరసవల్లి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో బహుమతులు అందజేశామని తెలిపారు. అరసవల్లి సుబ్రహ్మణ్యం, ప్రధానో పాధ్యాయుడు కే వెంకటరావు, పాల్గొన్నారు.

పాఠశాలలో వేసిన సామగ్రిని తొలగించాలి

కాళ్ల: పాఠశాల భవనంలో అనుమతులు లేకుండా ప్రైవేటు వ్యక్తి వేసిన సామగ్రిని వెంటనే తొలగించాలని కాళ్లకూరు సర్పంచ్ సాదు శ్రీదేవి, ఉప సర్పంచ్ నడింపల్లి ప్రదీప్ రాజు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పి.వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం విలేకరులతో మాట్లాడారు. కాళ్లకూరులో వెంకటాపురం పరిధిలో మండల పరిషత్ పాఠశాల శిథిలావస్థకు చేరిందన్నారు. ప్రమాదకరంగా ఉండటంతో ఎవరు ఏ విధంగానో ఉపయోగించకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఇటీవల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పాఠశాల భవనంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇంటిని నిర్మించుకునేందుకు ఇటుకలు వేశారని ఆరోపించారు. దీనిపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేసి విద్యాశాఖ, మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారని. అయినా ఎలాంటి స్పందన లేదన్నారు. పాఠశాల వద్ద ఉన్న ఇటుకలను తొలగించాలని డిమాండ్ చేశారు.

భానుడి.. భగభగ

- భయపెడుతున్న భానుడు
- మండలాల్లోనూ మంటలు
- ఎండకు తాళలేక ఆపసోపాలు
- సరిగా పనిచేయని ఏసీలు
- వేడిగాలి వీస్తున్న ఫ్యాన్‌లు
- జనం ఉక్కిరిబిక్కిరి



పరిమెళ్ల- కె. పెంటపాడు మధ్య మధ్యాహ్నం సమయంలో జనసంచారం లేక ఖాళీగా ఉన్న రహదారి



పెంటపాడులో ఎండ వేడిమితో ఇళ్లలో నుంచి బయటకు రాక కర్ఫ్యూను తలపిస్తూ జనసంచారం లేని వీధి

పెంటపాడు: భానుడు భగభగ పట్టాడు. గత మూడు రోజులుగా మండిపడుతున్నాడు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెంచుకుంటూ పోతున్నాడు. దీంతో జనం అల్లాడి పోతున్నారు. రోహిణి కార్తె రాక ముందే వచ్చిందా అన్నట్లు రోళ్లు బద్దలయ్యేలా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో వృద్ధులు, చిన్నారులతో పాటు, ప్రతీవారు ఆపసోపాలు పడుతున్నారు. విపరీతమైన వడగాల్పుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి జనం బయటకు రావడానికి భయపడుతున్నారు. అత్యవసర ప్రయాణాలు వాయిదా వేసుకొంటున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల వ్యాప్తంగా అన్ని మండలాలలోనూ గత మూడు రోజులుగా 45 నుంచి 47 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవడం గమనార్హం. స్మార్ట్‌ఫోన్ లెక్క ప్రకారం తాడేపల్లిగూడెం, తణుకు ప్రాంతాల్లో మంగళవారం 49 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయినట్లు చెబుతున్నా వాతావరణ శాఖ లెక్కల ప్రకారం 47 డిగ్రీలు నమోదు అయినట్లు సమాచారం. మొత్తం మీద మంగళవారం భానుడు మరింతగా మండిపడిపోయాడు. బుధవారం ఉక్కపోత ఎక్కువగా ఉంది. జిల్లాలో అన్ని మండలాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మంగళవారం అత్యధికంగా గరిష్ఠం 48.5, కనిష్ఠంగా 26.5గా నమోదైంది. మిట్టమధ్యాహ్నం ప్రతీ ఒక్కరి వద్ద వాటర్‌బాటిల్ కనిపించిందంటే ఎండ తీవ్రత ఎంత ఎక్కువగా ఉందో ఊహించవచ్చు. ఎండ వేడిమికి చేతులు మండిపోయాయి. ఉదయం 7 గంటల నుండే ఎండ తీవ్రత ఎక్కువ కావడంతో ఆరుబయట పనిచేసుకొంటున్న వారు ఉదయం 10 గంటలకు పని ముగించుకొని ఇళ్లకు చేరుకుంటున్నారు. తర్వాత ఫ్యాన్‌లు, ఏసీలకు పరిమితమయ్యారు. దాహార్తిని తీర్చుకొనేందుకు శీతల పానీయాలు ఆశ్రయించారు. సాధారణంగా రోహిణి కార్తెలో రోళ్లు బద్దలయ్యేలా ఎండలు ఉంటాయని నానుడి. కాగా గత రెండు రోజులు నుంచి అంతకంటే ఎక్కువగా దివి నుంచి భువికి అగ్నివర్షం కురిసినట్టుగా అధిక ఎండ, వడగాల్పులు వీస్తుండటంతో విస్తుపోతున్నారు. ఇంటిలో ఫ్యాన్ కింద కుర్చున్నా వేడిగాలులు వీచడంతో ఉక్కబోతతో అల్లాడుతున్నారు. రాత్రి అయినా వేడి తగ్గడంలేదు. వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు పలు ఇబ్బందులు పడుతున్నారు. వేడి తాపంతో కూడిన జ్వరాలు వస్తున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. రోడ్లు కరోనా నాటి కర్ఫ్యూను తలపిస్తున్నాయి. వ్యాపార దుకాణాలు సైతం మధ్యాహ్న సమయంలో మూసివేస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా రాష్ట్ర విపత్తుల సంస్థ జాగ్రత్తలను పాటించాలని ప్రజలకు ఫోన్‌ల్లో మెసేజ్‌లు పంపి హెచ్చరిస్తోంది. మరో వైపు వైద్యులు కూడా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. ఎండల వల్ల ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు పాటించాలని చెబుతోంది. అవసరమైతేనే తప్ప ఇళ్ల నుంచి ఎవరూ బయటకు రావద్దని హెచ్చరిస్తున్నారు. మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం వాడుకోవాలన్నారు. వడదెబ్బ సోకుండా వదులు దుస్తులు, లైట్ కలర్ దుస్తులు వాడుకోవాలని హెచ్చరిస్తున్నారు. ఇంకో వైపు విద్యుత్ శాఖ అధికారులు కూడా ప్రజలకు పలు సూచనలు చేశారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న కారణంగా విద్యుత్ వాడకం మరింత పెరిగిందన్నారు. ఫైన్ సబ్‌స్టేషన్‌ల్లో ఓవర్ లోడ్ అయ్యి, 11 కేవీ ఫీడర్స్ ట్రిప్ అవుతున్నాయన్నారు. దీనివల్ల గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లపై అధికబారం పడుతోందన్నారు. పరిధి దాటి లోడ్ కారణంగా ఫ్యూజ్‌లు పోవడం, కండక్టర్స్, కేబుల్ తెగిపోతున్నాయన్నారు. ఏసీలు ఉన్నవారు హై కూలింగ్‌లో పెట్టవద్దని, 25 నుంచి 30 డిగ్రీల్లో పెట్టుకొని వాడుకోవాలని సూచిస్తున్నారు. ఈఎల్ఆర్ ముగిసిన అనంతరం కరెంట్ రాగానే ఏసీలు, కూలర్లు, ఫ్రిజ్‌లు ఆన్‌చేయవద్దన్నారు. విలువైన పరికరాలను కాపాడుకోవడంతో పాటు, విద్యుత్ వాడకాన్ని కంట్రోల్ చేయవచ్చన్నారు. సాధ్యమైనంత వరకు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని గూడెం డివిజన్ విద్యుత్ శాఖ సూచిస్తోంది. మెస్సేజిల ద్వారా అప్రమత్తం చేస్తోంది.

ఇంటర్ సెట్‌లో 54 మందికి సీట్లు

తాడేపల్లిగూడెం రూరల్: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకులం, కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు నిర్వహించిన ఇంటర్ సెట్ పరీక్షలో 54మందికి ఫస్ట్ లిస్ట్‌లో సీట్లు వచ్చాయని పెదతాడేపల్లి గురుకుల విద్యాలయ ప్రిన్సిపల్ బి.రాజారావు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీఎస్‌డబ్ల్యూర్ఈఐ సొసైటీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఐఐటీ, నీట్‌కి 30 మంది తొలి దశ పరీక్షలో ఉత్తీర్ణులై రెండవ దఫా పరీక్షకు అర్హత సాధించారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను గురుకుల విద్యాలయాల జిల్లా సమన్వయాధికారి వాసవి, ప్రిన్సిపల్ బి.రాజారావు, వైస్ ప్రిన్సిపల్‌బి.ప్రసాద్, ఉపాధ్యాయులు వి.బలరామ్, వై.రాకేష్, డి.కృష్ణ, మధులత, విజయరాజ్, ఎంవి.బాలాజీ, రవి అభినందించారు.

నాడు-నేడు పనులు త్వరగా పూర్తి చేయాలి

తణుకు టౌన్: నాడు-నేడు పథకంలో చేపట్టిన పాఠశాలల ఆధునీకీకరణ పనుల్లో బాగంగా పాఠశాలల్లో మరుగుదొడ్లు, విద్యుద్దీకరణ పనులను వారం రోజుల్లో పూర్తి చేయాలని ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ డీఈ నాగేంద్ర బాబు ఆదేశించారు. బుధవారం మండలంలోని సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని పాఠశాలలో చేపట్టిన నాడు-నేడు పనులపై ఆయన సమీక్ష నిర్వహించారు. పాఠశాలలో చేపట్టిన పనులు నాణ్యతను ఎప్పటికప్పుడు సిబ్బంది పర్యవేక్షించాలని కోరారు. నాడు నేడు పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన సచివాలయ ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞానం.. వికాసం!



తణుకు మహిళా గ్రంథాలయంలో విద్యార్థినితో కథల పుస్తకం చదవిస్తున్న దృశ్యం



అత్తిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు బొమ్మల తయారీపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఉత్సాహంగా కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు

తణుకు టౌన్: గ్రంథాలయాల ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపట్టిన వేసవి శిక్షణా శిబిరాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. బుధవారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని జిల్లా గ్రంథాలయంలో జరిగిన వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులకు కథలు చెప్పడం, కథలు చదివించడం, పుస్తక సమీక్ష, ఇంగ్లీష్ పథాలను పూరించడం వంటి వాటిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో కోరా సత్యనారాయణ, రిటైర్డ్ ఏఈ కేఆర్ చక్రధరరావు, తెలుగు పండిట్ సీహెచ్ సీతా రామాంజనేయులు, ఏ ధనరాజు, సీహెచ్ బసవేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు. తణుకు పట్టణంలోని మహిళా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులతో నీతి కథలు చెప్పించడం, కథలు చదవడం, భగవద్గీత శ్లోకాలను నేర్పించడంతో జనరల్ నాలెడ్జ్ అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రీసోర్సు పర్సన్ జే అలకనంద, గ్రంథాలయ అధికారి ఎస్ ప్రవీణ పాల్గొన్నారు.

కాగితాలతో బొమ్మల తయారీపై శిక్షణ

అత్తిలి: వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో బుధవారం కాగితాలతో బొమ్మలు తయారీపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు కాగితాలతో పలు రకాల వస్తువులను తయారు చేసే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి భక్త హనుమాన్, కె విశ్వేశ్వరరావు, ఎం శ్రీదేవి, పి వెంకటేశ్వరరావు, గ్రంథాలయాధికారి డి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. ఆరవల్లి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి సత్తి శ్రీనివాసరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో విద్యార్థులు

విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి కలిగి ఉండాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని గ్రేడ్ -1 శాఖ గ్రంథాలయంలో బుధవారం వేసవి విజ్ఞాన తరగతులు ఆసక్తికరంగా జరుగుతున్నాయి. గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 10వ రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యార్థినీ విద్యార్థులకు పలు పాఠ్యాంశాలపై అవగాహన కల్పించారు. విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులైన ప్రత్తి వీరాస్వామి, ఎస్.సాల్మన్‌రాజులు మాట్లాడుతూ చిన్ననాటి నుంచే విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తిగా ఉండాలని పలు విషయాలను బోధించారు. మహాశివభట్టు లక్ష్మణరాజు తెలుగు పద్యాలు చెప్పారు.

విద్యార్థుల నమోదు పెంచేందుకు కృషి చేయాలి

అత్తిలి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ప్రధానోపాధ్యాయుడు డా.దత్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కొద్ది రోజుల్లో తమ పాఠశాలలో ఏర్పాటు చేయబోతున్న ఇంటరాక్టివ్ ఫ్లాట్‌ప్యానెల్ (ఐఎఫ్‌పి) ద్వారా ప్రభుత్వ పాఠశాలల చరిత్రలో నూతన అధ్యాయం ప్రారంభంకావడంతో పాటు అధునాతన బోధనా పద్ధతుల్లో ఆకర్షణీయ విద్యాబోధన జరగబోతోందని తెలిపారు. గడపగడపకు ప్రభుత్వ పాఠశాల కార్యక్రమంలో భాగంగా బుధవారం అత్తిలి మండలం బల్లిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుల బృందం ఇంటింటికి నిర్వహిస్తున్న విద్యార్థుల చేరిక ప్రచార కార్యక్రమం బల్లిపాడులోగల విద్యార్థుల గృహాలను సందర్శించారు. విద్యార్థులను తమ పాఠశాలలో ఎందుకు చేర్చాలో సోదాహరణంగా తెలిపారు. జగనన్న విద్యాకానుక ద్వారా కల్పిస్తున్న వివిధ సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని, పైసా ఖర్చులేకుండా అత్యుత్తమ విద్యను అందుకోవడం ప్రభుత్వ పాఠశాలల్లోనే సాధ్యమని తెలిపారు. బోధనలో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నారని, విద్యార్థి సర్వతో ముఖాభివృద్ధికి ప్రభుత్వ పాఠశాలలు నిలయాలని దత్ అన్నారు. దూర ప్రాంతాలకు తమ బిడ్డలను పంపాల్సిన అవసరం లేదని, వేలల్లో రుసుములు చెల్లించాల్సిన అవసరం లేదని, ఉచితంగా నాణ్యమైన విద్యను అందిస్తామని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అత్తిలి మండలం బల్లిపాడులో గడపగడపకు ప్రభుత్వ పాఠశాల కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల చేరిక ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఏపీ ఈఏపీసెట్ ప్రశాంతం

తాడేపల్లిగూడెం: ఏపీఈఏపీ సెట్ పరీక్ష మూడవ రోజు బుధవారం జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా పది పరీక్షా కేంద్రాలలో జరిగింది. తాడేపల్లిగూడెం శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఉదయం నిర్వహించిన పరీక్షకు 243 మందికిగాను 241 మంది హాజరైయారు. కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నకర్ వివరాలను వెల్లడించారు. పరీక్షా కేంద్రం కో ఆర్డినేటర్ నటరాజ్, సిస్టమ్స్ అడ్మిన్ కొల్లా సురేష్‌లు పరీక్షలను పర్యవేక్షిస్తున్నారు.

రాజకీయ విభేదాలతో నష్టపోతున్న ఉపాధి కూలీలు

తాడేపల్లిగూడెం రూరల్: గ్రామంలో రాజకీయ, వర్గ విభేదాలు కారణంగా ఉపాధి హామీ పథకం కూలీలకు పనులు కల్పించకపోవడంతో నష్టపోతున్నారని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల బాబూరావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని నందమూరు గ్రామంలో ఉపాధి హామీపథకం కూలీలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పనులు కల్పించకడంతో ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అధికారులు లోపాలను సరి చేసి అందరికీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టి.శ్రీనివాస్, గురుసుపూడి సర్వేశ్వరరావు, చిన్నం శేఖర్, వెల్దుర్తి పోచమ్మ,ఆరుగొల్లు శ్రీను, ఖండవల్లి రమణ, గన్నవరపు నాగరాజు,చిన్నం అప్పారావు, కడియపు ధనలక్ష్మి, అడపా దానయ్య పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

ఇరగవరం: ప్రతీ ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ పి.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం స్వచ్ఛా సర్వేక్షన్ ట్రెనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాల్లో పారిశుద్ధ్యం పై ఎప్పటికప్పుడు శ్రద్ధ తీసుకోవాలన్నారు. సంపద తయారి కేంద్రల్లో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సంపద తయారి కేంద్రంలో తయారైన వర్మి ద్వారా పంచాయతీకి ఆదాయం సమకుర్చుకోవాలని పేర్కొన్నారు. డ్రైనేజీల్లో మురుగు ఎప్పటికప్పుడు తొలగించి, పంచాయతీలకు ఆదాయం వచ్చే మార్గలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. వాటిపై అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వంతో పనిచేయాలని తెలిపారు. వీటిపై అనుమానాలు ఉంటే ఉన్నతాధికారులను సంప్రదించాలన్నారు. గ్రామల్లో ప్రభుత్వం అందిస్తున్నా పథకాలు, అభివృద్ధి ఫలాలు అందరికి అందించాలన్నారు. సర్పంచ్‌లు, మండల పార్టీ అధ్యక్షుడు కె దుర్గా ప్రసాద్, ఈవోపీఆర్డీ వై ముని రాజు పంచాయతీ, సీనియర్ అసిస్టెంట్ మూర్తి, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



ఇరగవరంలో స్వచ్ఛ సర్వేక్షన్ ట్రైనింగ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

సీఎం జగన్‌కు దేవుడి ఆశీస్సులు

ఉండి: ప్రజలకు మంచి చేసేందుకు ఆ దేవుడి ఆశీస్సులు ఎప్పుడూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై ఉంటాయని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. బుధవారం ఉండి మండలం పాందువ్వ క్రైస్ట్ లూథరన్ చర్చ్ ప్రతిష్ఠ కార్యక్రమానికి పీవీఎల్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఏఈఎల్‌సీ అధ్యక్షుడు ఫెడ్రిక్ పరదేశిబాబు, జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ బీ ఆనందకుమార్, పేరిష్ పాస్టర్ రెవరెండ్ ఎం.చింతారావు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి పీవీఎల్‌కు ఆశీస్సులు అందజేశారు. అనంతరం సంఘ ప్రతినిధులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ అందరికీ మంచి చేయడం యేసుప్రభువు బోధనల్లో ముఖ్య ఉద్దేశమని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో కులమతాలకు అతీతంగా పరిపాలన చేస్తున్నారని అన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పేరిట ఎన్నో జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. సీఎం జగన్ రాష్ట్ర ప్రజలందరికీ అన్ని సామాజికవర్గాల వారికి మంచి చేస్తున్నారని రాబోయే రోజుల్లో ఆ ప్రభువు చల్లని దీవెనలు ముఖ్యమంత్రిపై ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అల్లూరి రాంబాబు రాజు, గ్రామపార్టీ ప్రధాన కార్యదర్శి గొంతే హరీష్, పెల్లూరి అప్పన్న, పెల్లూరి సుబ్రహ్మణ్యం, గొల్లిపల్లి పోతురాజు, గొల్లిపల్లి యేసు, బొర్రా దానియేలు, యాళ్ళ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పాందువ్వ లూథరన్ చర్చ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ, ఈవోపీఆర్డీ ప్రసాద్

పెంటపాడు: ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా ఉండేలా సర్పంచ్‌లు, కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో టీవీ సత్యనారాయణ, ఈవోపీఆర్డీ వై. ప్రసాద్‌లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. పెంటపాడు మండల సమావేశ మందిరంలో బుధవారం సర్పంచ్‌లు, కార్యదర్శులకు స్వచ్ఛతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి పంచాయతీలో విధిగా స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా రోడ్లు, డ్రైనేజీల్లో చెత్తలేకుండా చూడాలన్నారు. అన్ని గ్రామాల్లో శానిటేషన్, తాగునీరు సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. శుభ్రత పాటించే విధంగా చెత్తను మూడు రకాలుగా విభజించి డంపింగ్ యార్డులకు తరలించాలన్నారు. దీంతో పాటు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమిష్టి కృషితో గ్రామాలను అభివృద్ధి పరచుకొని ప్రజలను శుభ్రతలో భాగస్వాములు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాచర్ల, జట్లపాలెం, పరిమెళ్ల, ఆకుతీగపాడు సర్పంచ్‌లు వాకా దుర్గాభవాని, ఖండవల్లి మణిరాజు, గొర్రెల కోటేశ్వరరావు, దాసం వెంకటేశ్వర్లు, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రత్యేక విధుల్లో విద్యుత్ ఏడీఈ, ఏఈలు



పెదతాడేపల్లి ప్రధాన సబ్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఏడీఈ ఆకుల సతీష్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పెరిగిన వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా విద్యుత్ డిమాండ్ పెరిగినందు వల్ల ఓవర్‌లోడ్‌ను అధిగమించేందుకు, విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ఏపీఈపీడీసీఎల్ నడుం కట్టింది. దీనిలో భాగంగా ప్రధాన సబ్ స్టేషన్, ఇతర అనుబంధ సబ్‌స్టేషన్‌ల్లో ప్రత్యేక విధుల్లో అధికారులను, సిబ్బందిని అందుబాటులో ఉంచింది. పెదతాడేపల్లి ప్రధాన సబ్ స్టేషన్‌లో ఏడీఈ ఆకుల సతీష్ ప్రత్యేక విధుల్లో ఉండగా 33/11 కేవీ నియోజకవర్గంలో ఉన్న అన్ని సబ్ స్టేషన్‌ల్లో ఏఈలు పర్యవేక్షించేటట్లుగా వారికి ప్రత్యేక డ్యూటీలు వేశారు. 24 గంటలు అధికారులు, విద్యుత్ సిబ్బంది పూర్తిస్థాయిలో ప్రత్యేక డ్యూటీల్లో ఉండాలని ఆదేశాలు జారీచేశారు. వినియోగదారులకు ఎటువంటి విద్యుత్ సమస్యలు రాకుండా చూస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు.

స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డుకు మూడు గ్రామాలు

తణుకు టౌన్: స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ అవార్డు 2023 కోసం జాతీయ స్థాయిలో జిల్లాలో మూడు గ్రామాలు పోటీలో నిలిచినట్లు ఎంపీడీవో టీఎస్ మూర్తి తెలిపారు. బుధవారం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచ్‌లకు, కార్యదర్శులకు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈకార్యక్రమానికి ఎంపీపీ రుద్ర ధనరాజు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తణుకు మండలం మహాలక్ష్మీ చెరువు, పెంటపాడు మండలం పెంటపాడు గ్రామం, ఉండి మండలం పావడ గ్రామాలు అవార్డు ఎంపిక కోసం పోటీ పడుతున్నట్లు తెలిపారు. వీటిలో అత్యధిక మార్కులతో తణుకు మండలం కొమరవరం గ్రామం నిలుస్తుందని చెప్పా రు. మహాలక్ష్మీ చెరువు గ్రామ సర్పంచ్ పాలా శ్రీను, కార్యదర్శులు పాల్గొన్నారు.